భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

28, అక్టోబర్ 2026, బుధవారం | భారత్ సమాచార్

# జనగణన–2027కు పటిష్ఠ ప్రణాళిక.. అధికారులకు ప్రత్యేక శిక్షణ



**భారత్ సమాచార్, మెదక్ జిల్లా**: జనగణన–2027ను నిర్దేశిత నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో పటిష్ఠ ప్రణాళికతో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. జనగణన రెండో దశ నిర్వహణకు సంబంధించి అక్టోబర్ 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు.

జనగణన–2027లో భాగంగా రెండో దశకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని మెదక్‌లోని IDOC కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, చార్జ్ అధికారులు, అదనపు చార్జ్ అధికారులు పాల్గొన్నారు. జనాభా గణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన విధివిధానాలు, చేపట్టాల్సిన చర్యలపై వారికి అవగాహన కల్పించారు.

## గణన బ్లాకుల ఏర్పాటుపై శిక్షణ

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. జనగణన రెండో దశలో గణన బ్లాకులు, ఉప గణన బ్లాకుల ఏర్పాటు కీలకమని తెలిపారు. ఆయా ప్రాంతాలను గుర్తించడం, జనాభా గణనకు సంబంధించిన విధివిధానాలను పాటించడం, గణాంకాల సేకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించడం వంటి అంశాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.




అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని తెలిపారు. జనగణన ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## రెండు రోజుల పాటు శిక్షణ

జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన జనగణన శాఖ అధికారులు మార్గపూడి ఉష, చించెట్టి మోనిక రెండు రోజుల పాటు శిక్షణ అందిస్తున్నారు. గణన బ్లాకులు, ఉప గణన బ్లాకుల గుర్తింపు, అధికారుల విధులు, గణాంకాల సేకరణకు సంబంధించిన అంశాలను వారు వివరిస్తున్నారు.

శిక్షణలో పొందిన అవగాహనను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ జనగణన ప్రక్రియను విజయవంతం చేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar